క్లుప్తంగా

పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి



టీచింగ్, లర్నింగ్ మెటీరియల్ తయారు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గాండ్లపెంట: చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఎంఈఓలు క్రిష్టానాయక్, శ్రీనివాసులు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏఎల్‌టీ(సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు 6 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. శనివారం పిల్లల్లో వికాస దశలు, పిల్లలు ఎలా నేర్చుకుంటారు, సమగ్రాభివృద్ధి ఎలా సాధించాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం రిసోర్స్‌పర్సన్లు షబ్బీర్‌బాషా, ఎస్ఎస్ నాయుడు, సునిల్ కరుణాకర్, సూపర్‌వైజర్ పద్మావతి టీచింగ్, లర్నింగ్ ఎయిడ్స్ తయారీపై అవగాహన కల్పించారు.

నేడు మండలంలో 'తోపుదుర్తి' పర్యటన

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదివారం మండలంలో పర్యటించనున్నారు. వెంకటంపల్లి, ఓశంపల్లి గ్రామాల్లో రైతులతో సమావేశమవుతారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వెంకటంపల్లిలో హంద్రీ–నీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్‌కు సంబంధించి రైతులతో చర్చిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మత్స్యకారులకు భరోసా కల్పిస్తాం



చెరువులోకి చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి

పుట్టపర్తి టౌన్: చేపల పెంపకం ద్వారా మత్స్యకారులకు జీవనోపాధి భరోసా కల్పిస్తామని ఎమ్మెల్యే సింధూరారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆమె బుక్కపట్నం చెరువులోకి 1.63 లక్షల చేపపిల్లలను వదిలారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బుక్కపట్నం చెరువును కృష్ణా జలాలతో నింపితే సుమారు 12 వేల హెక్టార్ల భూమిసాగులోకి వస్తుందన్నారు. చెరువులో చేపల పెంపకంతో మత్స్యకారులుకు జీవనోపాధి దొరుకుతుందన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

న్యాయ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి జయలక్ష్మి

కదిరి టౌన్: న్యాయవ్యవస్థ అందించే సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల న్యాయాధికార సేవా సంస్థ చైర్‌పర్సన్ జడ్జి జయలక్ష్మి పారా లీగల్ వలంటీర్లకు సూచించారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో పారా లీగల్ వలంటీర్ల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ వలంటీర్లు న్యాయస్థానాలకు ప్రజలకు మధ్య వారధులుగా పనిచేయాలన్నారు. న్యాయ వ్యవస్థ అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. న్యాయవాదులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు, దశరథనాయక్, వెంకటేష్, సిరాజుద్దీన్, రెడ్స్ సంస్థ ఎల్లప్ప పాల్గొన్నారు.

పీ4 సర్వే పక్కాగా చేపట్టండి



సర్వేను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ స్వర్ణలత

బత్తలపల్లి: సున్నా పేదరికమే లక్ష్యంగా తలపెట్టిన పీ4 సర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ స్వర్ణలత వీఆర్‌ఓలు, సర్వే సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలో పీ4 సర్వేను ఆమె ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓ రాణాప్రతాప్, వీఆర్ఏ రాజా చేపట్టిన సర్వేను గృహ యజమానులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. గృహ యజమాని అద్దె ఇంట్లో ఉంటున్నారా, పింఛన్ అందుకుంటున్నారా, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం పొంది ఉన్నారా, 4 చక్రాల వాహనాలు ఏవైనా ఉన్నాయా, పెన్షన్ పొందుతున్నారా తదితర వివరాలను నమోదు చేశారా అని ప్రశ్నించారు. కచ్చితమైన వివరాలను సేకరించి వాటినే నమోదు చేయాలని సర్వే అధికారులకు సూచించారు.

ఉన్నత విద్య అందని ద్రాక్షేనా!

- ఇంటర్‌తోనే ఆగిపోతున్న చదువులు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్

తాడిమర్రి: మండలంలోని విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోంది. ఇక్క డిగ్రీ కళాశాల లేక విద్యార్థుల చదువులు ఇంటర్‌తోనే ఆగిపోతున్నాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 14 గ్రామ పంచాయతీలు, 31 గ్రామాలు, 12,560 కుటుంబాలు, 32,600 మంది జనాభా ఉంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 5, కస్తూర్బా బాలికా విద్యాలయం, నార్పింపల్లిలోని జేవీఎం ఆర్డీటీ పాఠశాలతో పాటు 24 ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలు, ఎస్సీ, బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 192 మంది, కేజీబీవీ జూనియర్ కళాశాలలో 200 మంది విద్యార్థులు ఉన్నారు. ఏటా సుమారు 350 మందికి పైగా విద్యార్థులు ఇంటర్ విద్యరు పూర్తి చేసుకుంటున్నారు. వీరిలో కేవలం పదుల సంఖ్యలో విద్యార్థులు మాత్రమే ఉన్నత విద్య కోసం ఇతర పట్టణాలకు వెళుతున్నారు.

భారమవుతున్న డిగ్రీ విద్య

మండలంలోని డిగ్రీ కళాశాల లేక పోవడంతో విద్యార్థులు ధర్మవరం, అనంతరం, పులివెందుల తదితర పట్టణాలు, నగరాలకు వెళుతున్నారు. అక్కడ ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు వచ్చినా కూడా ప్రభుత్వ హాస్టళ్లలో సీట్లు రాక ప్రవేటు హాస్టళ్లలో సుమారు రూ.60 వేలు, రూ.70 వేలు కట్టలేక విద్యార్థులను ఇళ్లవద్దనే ఉంచుతున్నారు. చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల, మోదుగులకుంట, బంగారంపేట, ఎం.అగ్రహారం, మరవపల్లి, ఆత్మకూరు, నార్పింపల్లి, నిడిగల్లు, పిన్నదరి, పుల్లానారాయణపల్లి, పూలఓబయ్యపల్లి, ఏకపాదంపల్లి, నార్పింపల్లి, పుల్లంపల్లి తదితర గ్రామాల విద్యార్థులను ధర్మవరం, అనంతపురం పట్టణాల్లో చేరుస్తుండగా, కునుకుంట్ల, రామాపురం, చిల్లవారిపల్లి గ్రామాల ప్రజలు నార్పల, దాడితోట, నాయనపల్లి, తురకవారిపల్లి గ్రామాల ప్రజలు వారి పిల్లలను ఉన్నత చదువు కోసం పులివెందుల్లో చేరుస్తున్నారు. హాస్టళ్లలో సీట్లు రాకపోవడంతో బస్సులు, ఇతర వాహనాల్లో రాకపోకలు సాగిస్తూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక బాలికల అవస్థలు వర్ణనాతీతం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తాడిమర్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి. డిగ్రీ కళాశాల లేక పోవడంతో ఏటా వందలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలి.

–భరత్, ఇంటర్ విద్యార్థి, తాడిమర్రి

బాలికలకు తీవ్ర నష్టం



తాడిమర్రిలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో బాలికలకు తీవ్ర నష్టం కలుగుతోంది. అసలే బాలికల చదువుకు పెద్ద ప్రోత్సాహం చూపని సమాజంలో ఉన్నత విద్య కోసం బాలికలను ఇతర పట్టణాలు, నగరాలకు పంపడానికి బాలికల తల్లిదండ్రులు అయిష్టత చూపుతున్నారు. ఇంటర్ తర్వాత ఏటా వందలాది మంది చదువు మానేస్తున్నారు.

–శ్వేత, ఇంటర్ విద్యార్థిని, తాడిమర్రి

పేద విద్యార్థులకు భారం

పేద విద్యార్థులకు ఉన్నత విద్య భారంగా మారుతోంది. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేక పోవడంతో ధర్మవరం లేదా అనంతపురం పట్టణాలు, నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. చాలా మంది తల్లిదండ్రులు వ్యయప్రయాసలు భరించలేక పిల్లలను చదువు మాన్పిస్తున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి.

–సాకే.నారాయణ, పిన్నదరి, తాడిమర్రి.

ముదిరిన ఫ్లెక్సీ వివాదం

- మండల సర్వసభ్య సమావేశం వాయిదా

కదిరి అర్బన్: ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు వివాదం ముదిరింది. ఈనేపథ్యంలో శనివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. వివరాల్లో కెళితే..కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో టీడీపీ మండల కన్వీనర్ చెన్నకేశవులు ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని అక్కడి నుంచి తీసేయాలని గతంలో ఎన్నో సార్లు సర్పంచులు, ఎంపీటీసీలు ఎంపీడీఓ పోలప్పకు తెలియజేశారు. అదిగో ఇదిగో అంటూ ఎంపీడీఓ కాలయాపన చేస్తున్నాడనే కారణంతో తాము సభకు రాలేదని వారు చెబుతున్నారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రజాప్రతినిధులు కాబట్టి వాళ్ల ఫోటోలు ఉండచ్చని పార్టీలకు సంబంధించిన వ్యక్తి ఫోటో ఫ్లెక్సీలో ఉండకూదన్నారు. ఇక మీదట తాము సమావేశానికి రావాలంటే కార్యాలయం ముందు ఉన్న ఫ్లెక్సీ తీయాల్సిందే అంటున్నారు. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ రాధాబాయ్ మినహా ప్రజాప్రతినిధులు హాజరుకాలేదు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.



సమావేశానికి అధికారులు మాత్రమే హాజరైన దృశ్యం

విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలి

కనగానపల్లి: వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సమగ్రశిక్ష జిల్లా అధికారి దేవరాజు మోడల్ స్కూల్ సిబ్బందిని ఆదేశించారు. ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. ఆహారం కలుషితం కాగా, వసతి గృహంలోని పలువురు విద్యార్థులు ఇటీవల అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం సమగ్రశిక్ష జిల్లా అధికారి దేవరాజు మోడల్ స్కూల్, వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమన్నారు. దీన్ని గుర్తించి వారిని సరైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. వసతి గృహంలోని విద్యార్థినులకు మినరల్ వాటర్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుణమ్మ, సర్పంచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న సమగ్రశిక్ష జిల్లా అధికారి దేవరాజు

ఇళ్ల స్థలాలు ఇచ్చేదాకా పోరాడతాం

పుట్టపర్తి అర్బన్: అర్హులైన పేదలందరికీ గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చే దాకా పోరాటం కొనసాగిస్తామని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద పేదలతో కలిసి సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు అందజేయాలని ప్రభుత్వం జీఓ విడుదల చేసినా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. ఇంటి స్థలాల కోసం గ్రామ/ వార్డు సచివాలయాల చుట్టూ పేదలు తిరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారన్నారు. వెంటనే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ జిలానీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి, సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్, నాయకులు గంగాద్రి, తిరుపాలు, సాయి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

కలసికట్టుగా నేరాలు నియంత్రిద్దాం

ఓడీచెరువు: కలసికట్టుగా నేరాల నియంత్రణకు కృష చేద్దామని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద స్థానికులతో సమావేశం నిర్వహించారు. నేర ప్రవృత్తి కలిగివున్న వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు అలవాటు పడిన వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలాంటి వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామన్నారు. ఇళ్లకు తాళాలు వేయకుండా ఎక్కడికీ వెళ్లొద్దని ప్రజలకు సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం



చెన్నేకొత్తపల్లిలో చెత్త సేకరిస్తున్న కార్మికులు



ఎన్పీకుంట సంపద తయారీ కేంద్రంలో తడి,పొడి చెత్తను వేరుచేస్తున్న పారిశుధ్య కార్మికులు

చెన్నేకొత్తపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని, ఈ దిశగా అందరూ కృషి చేయాలని అధికారులు పేర్కొన్నారు. 'స్వచ్ఛ భారత్ మిషన్' కార్యక్రమంలో భాగంగా శనివారం చెన్నేకొత్తపల్లి గ్రామాల్లో అధికారులు ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించారు. చెన్నేకొత్తపల్లిలో పంచాయతీ ఈఓ నారాయణస్వామి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎన్పీకుంట: గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించి తద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టినట్లు ఈఓపీఆర్డీ మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని 14 పంచాయతీలలో ఈనెల 15 నుంచి ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శని, ఆదివారాల్లో పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వాటి నుంచి వర్మికంపోస్టు తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

ధర్మవరం రూరల్/ తాడిమర్రి : తాడిమర్రి మండలం చిల్లవారిపల్లిలోని కాటి కోటేశ్వర స్వామి క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆర్డీఓ మహేష్ గుడ్డికట్టుదారులకు సూచించారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంతోపాటు కాటికోటేశ్వర క్షేత్రంలో చిల్లవారిపల్లికి సంబంధించిన ఏడు కులాల కాపులు, కాపు పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మహేష్, డీఎస్పీ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ 2021లో జరిగిన ఘర్షణలు పునరావృతం కాకూడదన్నారు. హక్కులు, ఆచారమని లేని వాటి గురించి పాకులాడుతూ ఉత్సవాలకు విఘాతం కల్గించొద్దన్నారు. భక్తి భావంతో ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు సృష్టిస్తే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాడిమర్రి తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రంగారావు, ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు, ఎస్ఐ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్, డీఎస్పీ హేమంత్‌కుమార్

తాగునీటి ఎద్దడి తీర్చండి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

ఓడీచెరువు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తుమ్మల పర్వీన్ అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందంటూ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సమావేశ అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని వారిని ఆదేశించారు. వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, తహసీల్దార్ అనంతాచారి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హ్యాండ్ బాల్ పోటీలు



విజేతలతో అధ్యాపకులు

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లి మోడల్‌స్కూల్‌లో హ్యాండ్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులను జట్లుగా ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించారు. శనివారం సాయంత్రం పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్టుకు, విద్యార్థులకు మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్‌బాబు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. గెలుపోటములు సాధారణమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు జగదీష్, పీడీ అజీంబాషా తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: సత్యసాయిబాబా సేవా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం శనివారం ప్రశాంతి రైల్వేస్టేషన్‌లో ప్రశాంతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పైపల్లి గంగాధర్, ఆటో యూనియన్ అధ్యక్షుడు సాకే మాధవ, ఉపాధ్యక్షుడు సుధాకర్, కోశాధికారి లక్ష్మీపతి, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మహిళల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న డాక్టర్ రవినాయక్

చెన్నేకొత్తపల్లి: ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ సూచించారు. శనివారం ఆయన మండల పరిధిలోని హరియాన్‌చెరువు గ్రామంలో ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గర్భిణులు, రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

24న చేపల చెరువు వేలం

తనకల్లు: కొక్కంటి నారయనాయుని చెరువులో చేపలు పట్టుకోడానికి ఈ నెల 24న వేలంపాటను నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బాబ్‌జాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొక్కంటి గ్రామ సచివాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు వేలంపాట ప్రారంభమవుతందని, ఆసక్తి ఉన్న వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.


ఘనంగా సైన్స్ దినోత్సవం



సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న లెక్చరర్ రాజశేఖర్

ధర్మవరం రూరల్: నాగలూరు వద్ద వున్న రూపారాజ పీసీఎంఆర్ పాఠశాలలో శనివారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ నెల 28న సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని కార్యక్రమం చేపట్టారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల జువాలజీ లెక్చరర్ రాజశేఖర్ హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్లు రూప రాజా కృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్

ధర్మవరం రూరల్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శనివారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్, డాక్టర్ పివి ప్రియాంక హాజరై మాట్లాడారు. కళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ పద్మశ్రీ, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప, సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ ఆరోగ్య కార్యకర్త మెహతాజ్, సీఓ మారుతీ కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చిరుత సంచారం!

ఓడీచెరువు: శేషయ్యగారిపల్లి వద్దగల కొండప్రాంతాల్లో చిరుత సంచరిస్తుందనే అనుమానంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం పొలం పనులకు వెళ్లిన రైతులకు చిరుత అడుగులను పోలి ఉన్న ముద్రలు కనిపించాయి. ఈ నేపథ్యంలో ప్రజలు పొలాలకు వెళ్లడానికి జంకుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

ధర్మవరం రూరల్: పట్టణంలో బాలికల జూనియర్ కళాశాలలో శనివారం భక్తి శ్రద్ధలతో సరస్వతి పూజ నిర్వహించారు. కళాశాల చైర్మన్ బండి వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు ఇష్టంతో చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. అదే విధంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న షెడ్ నిర్మాణానికి విశ్రాంత కామర్స్ అధ్యాపకులు వసంత కుమారి రూ.3 లక్షలు, బండి లక్ష్మీదేవి రూ.2.50 లక్షలు విరాళాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

బీడీ కార్మికులకు పథకాలు అందించాలి

కదిరి టౌన్: బీడీ కార్మికులకు ప్రభుత్వ పథకాలను అందించాలని ఏపీ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఓబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ కో–కన్వీనర్ ఇక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఓబులు మాట్లాడుతూ బీడీ కార్మికుల కోసం కదిరిలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వడంతోపాలు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. బడ్జెట్ సమావేశాల్లో బీడీ కార్మికుల స్థితిగతులపై చర్చించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉమా గౌడ్, మున్ని, చంద్రకళ, హసీన్ తాజ్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

ధర్మవరం రూరల్: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిరస్మరణీయుడని రెడ్డి సంఘం నాయకులు గొట్లూరు కాటమరెడ్డి, కృష్ణారెడ్డి, రెడ్డి శేఖర్, రమణారెడ్డి కొనియాడారు. శనివారం పట్టణంలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉయ్యాలవాడ పోరాటం, ఆయన త్యాగం మనకు మార్గదర్శకాలు అవుతాయని వారు పేర్కొన్నారు.

28న వాహనాల వేలం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్(బ్రాహ్మణపల్లి)లో వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్రవాహనాలను ఈనెల 28న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు శనివారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ముదిగుబ్బ: నాగలగుబ్బ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈదులపల్లికి చెందిన గంగాధర్, ఆదెప్ప బైక్‌పై ముదిగుబ్బకు బయలుదేరారు. నాగలగుబ్బ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని 108 సిబ్బంది రవికుమార్, అబ్దుల్ రహీం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.